



# అమెరి"కలకలం" కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



# 18

# నాయుడు బాబుకి బహిరంగ లేఖ –బాబ్బాబు

అదేమిటో ..ఈ సారి నేను ఇంకా ఈ కథకి టైటిల్ పెడుతూ ఉండగానే మా క్వీన్ విక్టోరియా కంట పడిపోయింది.

"అదేమిటీ, బహిరంగ లేఖా…అంటే నువ్వు ఆయనకి ప్రైవేటుగా ఉత్తరం రాస్తే చదవడనేగా ఈ వెధవ్వేషాలూ, హన్నా" అని హుంకరించింది.....

నేను మొహంలో ఫీలింగులు ఎడ్జస్ట్ చేసుకునే లోగానే

"అవున్లే…నీ సంగతి నాకు తెలియదా…మన పెళ్ళయిన కొత్తలో నువ్వు బరికేసిన ప్రేమ లేఖ కూడా బహిరంగ లేఖే కదా…మీ అందరూ చదివాకే నా దాకా వచ్చింది….చస్తే మర్చిపోను." అని కూడా రుసరుస లాడింది మా మహారాణి.

ముప్ఫై, నలభై ఏళ్ల క్రితం కొత్త పెళ్ళానికి అమెరికా వీసా ఎలా తెచ్చుకోవాలో వివరిస్తూ ఏదైనా ఉత్తరం రాశానేమో నాకు గుర్తు లేదు కానీ ఆవిడ అస్తమానూ అదే గుర్తుకి తెచ్చుకుని రుసరుస లాడే ఈ ప్రేమ లేఖ సంగతి ఖచ్చితంగా గుర్తు లేదు. అయినా పెళ్లి అయిపోయాక కూడా ప్రేమ లేఖ రాయడం ఏమిటీ నా బొంద! ఏమో…మా పెళ్లికి ముందు ఆవిడ మీద మనసు పడ్డ ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కుర్ర వెధవలు రాసిన ""ఆయాసం" లేఖలకీ నా "వీసాయాసం" లేఖలకీ మధ్య కొంచెం కన్ఫ్యూజ్ అవుతోందేమో మా ఆవిడ అని నా అనుమానాలు నాకు ఉన్నా, ఆ విషయం అడగడం ఎందుకూ, తీగె లాగితే డొంకంతా కదులుతుంది అని, ఆవిడని ప్రేమా–పెళ్ళీ–పెటాకులూ–సంసారం వగైరా టాపిక్స్ మీద అనవసరంగా ఆవేశపెట్టడడం ఎందుకులే అని బుర్ర అందుబాటులో పెట్టేసి, ఆవిడ ఇచ్చే "టెంకి జెల్ల బహుమతి" అందుకుని ....ఆవిడని ఉద్యోగానికి సాగనంపి నాయుడి బాబు కి ఉత్తరం రాయడం మొదలు పెట్టాను.

చంద్ర బాబు నాయుడు గారూ,

మా తూ.గో. మరియు ప.గో జిల్లాల వారి ధర్మమా అని మీరు అఖండ విజయం సాధించినందుకు నా అభినందనలు. ఇప్పుడు ఇక ముసుగులో గుద్దులాట అక్కర లేదు కాబట్టి డైరెక్ట్ గా ఎన్నికల సబ్జెక్ట్ లోకి వచ్చేస్తాను. ఎన్నికల సబ్జెక్ట్ అంటే ఏ కులంలో ఎంత మంది ఉన్నారు, వాళ్ళు ఎవరికీ ఓటు వేస్తారూ అనేదే కదా అసలు సబ్జెక్టూ. మీకు ఏ సలహాదారూ, చెంచా గారూ, సర్వే గారూ చెప్పని రహస్యం ఏమిటంటే మా "గొడావరీ" జిల్లాలలో రాజకీయంగా కాస్తో, కూస్తో ప్రాబల్యం ఉన్న ఓ వర్గానికి చెందిన వారిలో బాగా డబ్బున్న వారిని

నాయుడు బాబు అంటారు దర్జాగా....అంచేత మీ పేరు చంద్రబాబు నాయుడు కాబట్టి పొరపాటు పడి ఆవేశంగా ఆ వర్గం వారు గుడ్డెద్దు చేలో పడ్డట్టు మీకు ఎక్కువగా ఓట్లు గుద్దేశారేమో అని నా అనుమానం. పైగా పవన్ కళ్యాణ్ అనే ఆ వర్గం కొత్త నాయకుడు సుడిగాలిలా వచ్చి మంట పెట్టగానే ఆ మంటల్లో అన్న గారి కాంగ్రెస్ వారు మాడి మసి అయి పోయారు. మరో ఐదేళ్ళు పోయాక కూడా "జనసేన" పార్టీ జెండా పీకేసి పీ.కే గారు మీకే మద్దతు ఇస్తారనుకుంటే తస్మాత్ జాగ్రత్త! పైగా రాయలసీమలో రె.సి వారు నిజంగా రె.సి కాని జగన్మోహన్ రెడ్డికే మీకంటే ఎక్కువ ఓట్లు వేశారు అని మర్చిపోకండి. ఇక మీరు ఎంత "రెండు కళ్ళు" అనుకుని తెలంగాణాని కూడా కంటికి రెప్పలా చూసుకుంటాను అని ఎన్ని తంటాలు పడ్డా అక్కడ నెగ్గిన ఒక బక్క చిక్కిన వె.దొ.సి గారు మిమ్మల్ని పక్కలో బల్లెంలా ఐదేళ్ళ పాటూ పొడుస్తూనే ఉంటాడు. ఇంకా పూర్తిగా పగ్గాలు చేపట్టకుండానే ఆయన ఆంధ్రా వాళ్ళ ఉద్యోగాలు కేన్సిల్ అనీ, పోలవరం డిజైన్ తప్పుల తడక అనీ, తెలంగాణా అమ్మాయి ఆంధ్రోడితో చేసుకున్న షాదీ బర్బాద్ అనీ, ఏదో వంకతో రోజూ టీవీ లో కనపడుతూ మీకు చికాకు పెడుతూనే ఉంటారు. అప్పుడెప్పుడో "పెద్ద మనుషుల ఒప్పందం" తో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పుడు "దొరల–దొరసానీల గూడు పుఠాణీ" తో విడిపోతే పోయింది కానీ తెలంగాణా వాళ్ళని వాళ్ళకే వదిలేసి, అసలు మీ జాతీయ పార్టీ ఐడియా పక్కకి పెట్టేసి, కట్టుకున్న ఆంధ్రా–రాయల సీమ కంకణాన్ని కాపాడుకోండి. రేప్పొద్దున్న రాయల సీమ కూడా విడిపోదల్చుకున్నా, ముందే "ప్రేమ లేఖలు" రాసేసి తరువాత నాలిక కరుచుకోకుండా అది దర్జాగా జరిపించండి. అదీ నా ఉచిత సలహా!

అన్నట్టు కంకణం అంటే జ్ఞాపకం వచ్చింది. క్రిందటి సారిలా కాక, ఈ సారైనా మీరు పవర్ ఉన్నప్పుడు మన ఇనప్పెట్టెలో ఉన్న అసలు బంగారాన్ని బైట పారేసి అమెరికాలో ఉన్న గిల్టు బంగారాన్ని ఎక్కువగా కొనుక్కుంటే ఈ సారి మోస పోతారు. ఇప్పుడు మీకు మీకు Y2K అండ లేదు కదా! అంచేత ఐటీ –అమెరికా అస్త్రం ఎక్కువ పేలదు. మన అసలు బంగారం మన భాష, సాహిత్యం అనీ, వాటి నమ్ముకుంటే చాలా మంచి ఉద్యోగాలు అక్కడే సృష్టించవచ్చునూ, అన్నింటికీ అమెరికా కేసే చూడక్కర లేదు అనీ ఒక చిన్న బి.సి. గా మీకు ప్రైవేటు చెప్పాలనిపిస్తోంది. ఎందుకంటే, ఎన్టీఆర్ గారు బాపు–రమణ ల చేత పాఠశాలలో మంచి తెలుగు నేర్పించడానికి తయారు చేయించిన వీడియోలని బైట పారేసింది మీరే కదా! "ఉద్యోగాలకి కావలసిన ఇంగ్లీషు నేర్చుకోడానికి తెలుగు అడ్డం" అనే దూరాలోచన లేని ఆలోచనా విధానానికి అప్పటి నుంచే రెక్కలు వచ్చి, తెలుగుని బహిష్కరించిన ప్రైవేట్ కాలేజీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి ఇప్పటికీ మన భాషనీ, సాహిత్యాన్నీ మట్టి కరిపిస్తున్నాయి కదా. ఆ మాటే ఒక సారి మీరు ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడే నేనూ, ఒక "జ్ఞాన పీట" గారూ, ఒక పొట్టి, గట్టి అవధాని గారూ, ఇద్దరు పెద్ద బి.సి.లు కలిసి భాష కోసం మీ ఆఫీసుకొచ్చి భోరుమని ఏడిచాం. మీకు అది ఎలాగా గుర్తు ఉండదు కానీ ఈ సారి అయినా మన "సాహిత్య బంగారానికి" కాస్త మెరుగుపెట్టండి. ముందుగా ప్రభుత్వ హయాంలో ఉన్న పాఠశాలల అధోగతిని ఒక్క సారైనా చూసి, అన్నింటికీ తగిన బడ్జెట్ సమకూరిస్తే....మీకు రెండు ప్రయోజనాలు కలుగుతాయి. ఒకటి తెలుగు భాష కాస్తో , కూస్తో నిలబడుతున్నది ఆ ప్రభుత్వ పాఠశాలలలోనే కాబట్టి...ప్రైవేట్ స్కూళ్ళలో చచ్చిపోయిన మన భాషని మీరు బతికించగలుగుతారు. పైగా ఆ పాఠశాలలకి వెళ్ళే వారిలో ఎక్కువ మంది ఎస్.సి. లే కాబట్టి మీకు రాబోయే ఎన్నికలలో ఓట్లు బాగా పడతాయి. తాజా ఉదాహరణ మా కాకినాడ లో ఉన్న 130 ఏళ్ల నాటి పి.ఆర్. జూనియర్ కాలేజ్ , బోయ్స్ హై స్కూల్ & గర్ల్స్ హై స్కూల్. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు తెలుగు నేర్చుకున్న, నేర్పిన ఆ పాఠశాల ప్రాంగణం ఇప్పుడు ఎలా ఉందో "మనోళ్ళ" ని పంపించి చూడండి. సిగ్గేస్తుంది. మీ "రెండు కళ్ళ" లోనూ నీళ్ళు వస్తాయి.

ఇక బహుశా "ఎవడో చెప్పిన తప్పుడు కుల కారణాల" కి అన్న ఎన్టీ ఆర్ గారు రద్దు చేసిన సాహిత్య ఎకాడెమీ, సంగీత, నాటక ఎకాడెమీ, గ్రంధాలయాలకి పుస్తక కొనుగోలు బడ్జెట్ మొదలైనవన్నీ జిల్లాకి ఒకటిగా పునరుద్దరించి "సాహిత్యాంధ్ర ప్రదేశ్" స్థాపించండి. ఎన్ని కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయో లెక్కెట్టుకోండి. అంతే కాదు...మా అమెరికా తెలుగు సంఘాలు కూడా "ఓహో, ఇందులో ఏదో గ్లామర్

ఉంది కాబోసు అని ఇక్కడ కూడా ఎవరి సాహిత్య ఎకాడెమీ వారు పెడతారు కూడాను...అనగా క.సి. లేదా రె.సి సాహిత్య సంఘాలు పుట్టుకొస్తాయి. ఇక తెలంగాణా సంఘాలు ఇప్పటికే చాలా పుట్టుకొచ్చేశాయి...సో...నో ప్రోబ్లెం....

ఇంతకీ ఈ పెద్ద బి.సి , చిన్న బి,సి, సోది ఏమిటంటారా? ముందే చెప్పానుగా...ముసుగులో గుద్దులాట ఎందుకూ అని....పెద్ద B.C అంటే నిజంగానే బేక్వర్డ్ కేస్ట్ అన్నమాట... .....అందులో పీకే గారూ, చిరంజీవిగారూ అవసరాన్ని బట్టి వస్తూ, పోతూ ఉంటారు. ఇక చిన్న b.c అంటే ఒకానొకప్పుడు రాజకీయ కుశాగ్ర కులం వాళ్ళే అయినా ఇప్పుడు "ఎక్కడ వేసిన అక్కడే గొంగళీ" బాపతు "బ్రాహ్మిన్ కేస్ట్" అన్నమాట. అలాగే రె.సి. అంటే రెడ్డి కేస్ట్ అనీ, క.సి. అంటే.....అదేనండీ "మనోళ్ళు"...

అన్నట్టు ఏన్నార్ గారి ఆఖరి సినిమా "మనం" చూశారా? మీ మాట నాకు తెలియదు కానీ ఆ సినిమా చూడగానే నాకూ, మా క్వీన్ విక్టోరియా కి ఏమనిపించిదంటే...."ఏఎన్నార్ ని తెలుగు వారు మర్చిపోలేరు. ఎన్టీఆర్ ని తెలుగు దేశం వాళ్ళు మర్చిపోనివ్వరు".

అన్నట్టు కొత్త రాజధాని పేరు "పొట్టి శ్రీరాములు నగరం", "గురజాడ నగరం" "ప్రకాశం నగరం" లాంటివి ఏమైనా పెడుతున్నారా లేక "ఎన్టీఆర్ నగర్ " అని అప్పుడే ఖరారు చేసేశారా? ఎంతయినా అది బెజవాడ–గుంటూరు చుట్టుపక్కలే ఉంటుందిగా.

చాలా ఏళ్లగా జరుగుతున్న చరిత్ర లంచం, కోర్ట్ ఉత్తర్వులు, ఇన్ఫ్లుయేన్స్,...

మరి ఇప్పుడు? ఏమో? అంతా "నమో" నమ:

**COMMENTS**